ఉష్ణోగ్రత (అంచనా)

9-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	39	27
నరసరావుపేట	39	25
బాపట్ల	37	28
రెంటచింతల	39	26
చీరాల	37	28

ఈ-శ్రమ్.. నిర్లక్ష్యం

- లక్ష్యం చేరుకోవడంలో అధికారుల విఫలం
- అసంఘటిత కార్మికులకు కార్డుల జారీ అంతంతే
- బహుళ ప్రయోజనాలున్నా అవగాహనపై ఉదాసీనం
- నమోదుకు దూరంగా ఇంకా ఏడు లక్షల మంది శ్రామికులు

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు.. గాయపడితే లక్ష వరకు ఆర్థిక సాయం. అసంఘటిత రంగ కార్మికులకు పైసా ఖర్చు లేకుండా బీమా అందించేలా కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ కార్డును ప్రవేశపెట్టింది. కార్మికుల భద్రత, సంక్షేమమే ధ్యేయంగా ప్రాయోజిత పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సంక్షేమ పథకాలకు అర్హులుగా తేల్చడానికి కూడా ఈ-శ్రమ్ ప్రామాణికంగా ఉపయోగపడనుంది. అసంఘటిత రంగ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలను చేకూర్చే ఈ కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కార్మికులకు అవగాహన కల్పించి ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకునేలా వారిని చైతన్యపరచాల్సిన యంత్రాంగం ఉదాసీనంగా ఉంటున్నది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వారీగా లక్ష్యాలకు ఆమడ దూరంలో కార్మికశాఖ ఉంది. మూడు జిల్లాల్లో ఇంకా 7 లక్షల మంది కార్మికులు ఈ-శ్రమ్‌కు దూరంగా ఉంటున్నారంటే అధికారుల్లో నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రాయోజిత పథకం ఈ-శ్రమ్. ఇందులో నమోదు చేసుకున్న కార్మికుడికి ఈ-శ్రమ కార్డును ప్రభుత్వం అందించనుంది. కార్మికులకు ఎంతో ఉపయోగపడే ఈ పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించగా.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ అదే ధోరణి కనిపిస్తోంది. కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ప్రధానంగా ఈ పథకంపై క్షేత్రస్థాయిలో కార్మికులకు అవగాహన కల్పించే వారే కరువయ్యారు. అసంఘటిత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడే ఈ-శ్రమ్ కార్డు విషయంలో నెలవారీగా సమీక్షలు జరిపి పురోగతి తెలుసుకోవడం కూడా లేదు. మొక్కుబడిగా ఓ ప్రకటన ఇచ్చి వదిలేయడం తప్పితే లక్ష్యాలను చేరుకుని పథకం ఫలాలను కార్మికులకు చేరుస్తామన్న చిత్తశుద్ధి యంత్రాంగంలో కొరవడింది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోని కార్మికుల సంఖ్య గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు ఏడు లక్షల మంది వరకు ఉన్నట్లు సమాచారం. ఒక్క బాపట్ల జిల్లాలోనే రెండున్నర లక్షలమంది ఈ పథకానికి దూరంగానే ఉన్నారు. ఈ-శ్రమ్ నమోదుకు సంబంధించి సచివాలయాల వారీగా కార్మికశాఖ సమీక్ష



చేయ లేదు. నిర్దేశించిన లక్ష్యాలకు దూరంగా ఉన్నా నమోదులో గణనీయమైన ఫలితాలు సాధిస్తున్నామనే ఆర్భాటపు ప్రకటనలకే కార్మికశాఖ పరిమితమైందని విమర్శలు వస్తున్నాయి. పైగా కార్మికుల డేటా ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఉన్నందున నమోదులో జాప్యం జరుగుతుందనేది యంత్రాంగం వాదన. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు కలిగిన అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ పథకానికి అర్హులు. ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని చిరువ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, వీధి వ్యాపారులు, ఆశా వర్కర్లు, మత్స్యకారులు, ఉపాధి హామీ శ్రామికులు, ఆటో డ్రైవర్లు, రిక్షా, రాడ్ బెండింగ్, ప్లబింగ్, టైల్స్, కరెంటు, వెల్డింగ్, ఇటుక తదితర రంగాలలో పనిచేసే వారందరూ కూడా అర్హులే. కానీ వీరిలో చాలామందికి ఈ-శ్రమ్‌లాంటి ఓ పథకం ఉందని కూడా తెలియకపోవడం విశేషం. పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాలు, సీఎస్సీ కేంద్రాలు, కార్మికశాఖ కార్యాలయంలో అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ-శ్రమ్ కార్డు నమోదుకు రూ.13 చొప్పున ఇస్తామని ప్రకటించి కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులకు రూ.50 లక్షలు బకాయి పెట్టింది. దీంతో ఆయా సెంటర్ల నిర్వాహకులు ఈ-శ్రమ్ కార్డు నమోదును నిరుత్సాహ పరుస్తున్నట్లు సమాచారం.

ఫీజు.. పత్రాలని పీడింపు

ఈ-శ్రమ్‌పై అవగాహనతో కొందరు నమోదుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నా వారిని ఫీజు, ధ్రువీకరణపత్రాలంటూ పీడిస్తున్నట్లు సమాచారం. నమోదుకు ఎలాంటి ఫీజు అవసరం లేదు. అయితే కొన్ని చోట్ల రిజిష్టర్ పేరిట వసూళ్లకు దిగుతున్నట్లు తెలుస్తోంది. నమోదుకు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌తో పాటు ఆధార్‌కు లింక్ అయి ఉన్న ఫోన్ నంబరు, నామినీ ఆధార్ వివరాలు చాలు. కానీ ఏవేవో పత్రాలు కావాలని తమను తిప్పుకుంటున్నారని కార్మికులు వాపోతున్నారు.

కలెక్టర్‌కు.. రెడ్‌క్రాస్ అవార్డు

❖ వెంకటమురళికి అందజేసిన గవర్నర్



గవర్నర్ నజీర్ నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా కలెక్టర్ జె.వెంకటమురళి చేపడుతున్న సేవలను గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రశంసించారు. రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ నుంచి కలెక్టర్ అవార్డు అందుకున్నారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే బాపట్లను అగ్రగామిగా నిలిపినందుకు కలెక్టర్‌కి అవార్డు, పతకాన్ని అందజేశారు. ఇటీవల కృష్ణానది వరద విపత్తు సమయంలో జిల్లాలో ఎలాంటి ప్రాణహాని జరగకుండా ముందస్తు ప్రణాళికతో జాగ్రత్త చర్యలు తీసుకున్నారని కలెక్టర్‌ను గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై నిఘా

❖ వదంతులను వ్యాపింప చేస్తే కఠినచర్యలు ❖ ఎస్పీ తుషార్‌డూడీ హెచ్చరికలు

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలపై సైబర్‌సెల్ పోలీసులతో ప్రత్యేకంగా నిఘా ఉంచామని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. డీపీవో, సోషల్‌మీడియా సెల్‌ను గురువారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెచ్చగొట్టే విధంగా వార్తలను సోషల్ మీడియా వేదికగా వ్యాపింప చేసేవారిని వేగవంతంగా గుర్తించాలని సోషల్ మీడియా సెల్ అధికారులకు ఎస్పీ సూచించారు. విద్వేషపూరితమైన సమాచారాన్ని సోషల్ మీడియిలో పోస్ట్ చేసేవారిని గుర్తించి, వివరాలను సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు అందజేయాలన్నారు. సిబ్బంది రికార్డులు సక్రమంగా నిర్వహించాలని డీపీవో అధికారులకు సూచించారు. సామాజిక మాధ్యమాలలో విద్వేషపూరిత వదంతులను వ్యాపింప చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ జయకుమార్, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.



సోషల్ మీడియా, సైబర్‌సెల్ విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు.. నాలుగో ఎలైన్‌మెంట్

- 47.848 కిలోమీటర్ల పొడవునా ప్రతిపాదిత మార్గం
- ఎన్‌హెచ్-216, ఎస్‌హెచ్-261, 269, 334, 279, 350 మీదగా నిర్మాణం
- ఈ రూట్ అయితే బహుళ ప్రయోజనాలున్నాయని కన్సల్టెన్సీ అభిప్రాయం
- అమరావతి ఓఆర్ఆర్-నిజాంపట్నం పోర్టు హైవేకు కేంద్రం ఆమోదం

ఖర్చు తక్కువ.. పర్యాటకం

గుంటూరు, బాపట్ల జిల్లాల మీదగా నాలుగో ఎలైన్‌మెంట్‌కు అటు కన్సల్టెన్సీ ఇటు అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో ఎన్‌హెచ్-216, రాష్ట్ర హైవేలు-261, 269, 334, 279, 350 మీదగా రోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించింది. 47.848 కిలోమీటర్లు పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు ఖర్చు తగ్గుతుందని అంచనా వేశారు. ఈ హైవేతో ప్రముఖ పర్యాటక ప్రదేశాలైన సూర్యలంక, చీరాల బీచ్‌లు, క్షీర భావన్నారాయణ స్వామి, సుందరవల్లి, జిల్లెళ్లమూడి అమ్మవారు, సహస్రలింగేశ్వర, వీరాంజనేయస్వామి దేవస్థానాలకు పర్యాటకం పెరుగుతుందని డీపీఆర్ రూపొందించిన సంస్థ అభిప్రాయం వ్యక్తం చేసింది.

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్మించబోయే అమరావతి అవుటర్ రింగురోడ్డులో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరు నుంచి బాపట్ల జిల్లా నిజాంపట్నం పోర్టు వరకు కేంద్ర ప్రభుత్వం నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకి సుముఖత వ్యక్తపరిచింది. ఇందుకోసం సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి డీపీఆర్ నివేదించేందుకు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించింది. ఆ సంస్థ తొలుత మూడు ఎలైన్‌మెంట్లను పరిశీలించి నివేదిక అందజేసింది. కొత్తగా నాల్గో ఎలైన్‌మెంట్‌ని కూడా సిద్ధం చేసి ప్రజంటేషన్ ఇచ్చింది. సామాజిక ప్రభావం తక్కువగా, ఖర్చు తక్కువయ్యే ఈ నాలుగో ఎలైన్‌మెంట్ ప్రకారం నిర్మిస్తే పర్యాటకం పెరుగుతుందని కన్సల్టెన్సీ సంస్థ డీపీఆర్‌లో పొందుపరిచింది. 47.848 కిలోమీటర్లు పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు ఖర్చు రూ.1391.46 కోట్లయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. ఇందులో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు రూ.240.98 కోట్లు, నిర్మాణాలకు రూ.890.93 కోట్లు అవుతాయని డీపీఆర్‌లో పొందుపరిచారు. వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు అత్యుత్తమైన కనెక్టివిటి పెరుగుతుంది. సూర్యలంకలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్సు బేస్‌స్టేషన్, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్‌కు కనెక్టివిటీ పెరిగి స్థానికంగా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. అంతేకాకుండా రాష్ట్ర హైవేలు ఎస్‌హెచ్-240, 261పై ట్రాఫిక్ తగ్గి సరుకు రవాణా వేగవంతంగా జరుగుతుంది. 1975లో 27.87 ఎకరాల అటవీ మళ్లింపు జరగ్గా ఇందులో 17.87 ఎకరాలను ఫిషింగ్ హార్బర్ అప్రోచ్‌కు వినియోగిస్తున్నారు. మిగతా భూమిలో ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి ఏపీఎంబీ సీఈవో ఎన్‌వోసీ కూడా జారీ చేశారు. పర్యావరణ హితంగా నిర్మించబోయే ఈ రోడ్డు మార్గంలో మొత్తం 24 చోట్ల కెనాల్/రివర్ క్రాసింగ్స్ చేయాలి. అలానే విజయవాడ-గూడూరు సెక్షన్‌లో చుండూరు రైల్వేస్టేషన్‌కు సమీపంలో 12+245 వద్ద రైల్వే క్రాసింగ్ కూడా చేయాల్సి ఉంటుంది. రేపల్లె - బాపట్ల డీసీ/ఎస్‌సీ లైన్(పీ)లో 28+550 లొకేషన్ వద్ద 132 కేవీ పవర్ లైన్‌ని కూడా క్రాస్ చేయాల్సి ఉన్నది. ఈ డీపీఆర్‌కి కేంద్రం కనక ఆమోదం తెలిపితే ఆరు నెలల్లో భూసేకరణ, ఏడాది వ్యవధిలో నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని బాపట్ల ఎంపీ కృష్ణప్రసాదు స్పష్టం చేశారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టును త్వరితగతిన గ్రౌండింగ్ చేసేందుకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎంపీ టీ కృష్ణప్రసాదు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.



మ్యాప్‌లో నీలం రంగులో ఉన్న ప్రాధాన్య ప్రతిపాదిత ఎలైన్‌మెంట్

రాబోయే ప్రాజెక్టులు

ఈ ఎలైన్‌మెంట్ వెంట కొత్తగా పలు ప్రాజెక్టులు రాబోతున్నాయి. నల్లపాడు - కృష్ణాకెనాల్ రైల్ ఓవర్ రైల్, కృష్ణాకెనాల్ - నల్లపాడు 3, 4 రైలు మార్గాలు, ఈస్టు కోస్టు కారిడార్ భవిష్యత్ డీఎఫ్‌సీ, కృష్ణానది వంతెన మీదగా గుడివాడ - తెనాలి(విజయవాడను బైపాసు చేస్తూ) రోడ్డు మార్గం వంటి ప్రాజెక్టులు ఇప్పటికే మంజూరై ఉన్నాయి.

వాడరేవులో వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన 300 కుటుంబాలు

చీరాల, మే 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీకు మరో షాక్ తగిలింది. వాడరేవు గ్రామంలో వైసీపీకి చెందిన క్రియాశీలక నాయకులు ధోనె రామిరెడ్డి, కావూరి నాగరాజు, మంచాల నాగరాజు, పెద్దబ్బాయి తదితరుల సారధ్యంలో 300 కుటుంబాలతో కలిసి గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొండయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాద్ పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో యువ నాయకుడు గౌరీఅమర్నాథ్, ఏఎంసీ చైర్మన్ జనార్థనరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బందు గురన్న, మాజీ ఎంపీటీసీ పిన్నిబోయిన రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.



పార్టీ కండువాతో స్వాగతిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్



- ముళ్లచెట్లపైనే విదేశీ పక్షులు
- మైలవరం, వెలమవారిపాలేల్లో విహంగాల సందడి
- సరైన సౌకర్యాలు కల్పించాలంటున్న పక్షి ప్రేమికులు

ఆవాసం లేక అవస్థలు

అద్దంకి, మే 8 (ఆంధ్రజ్యోతి): విదేశీ పక్షుల రాకతో.. మండలంలోని మైలవరం, బల్లికురవ మండలం వెలమవారిపాలెంలో సందడి నెలకొంటోంది. ఏటా జనవరి నెలలో నైజీరియా దేశం నుంచి కొంగలు వచ్చి జూన్ నెల వరకు ఉండి గుడ్లు పెట్టి పిల్లలను పెంచుకుని వెళ్తుంటాయి. గుండ్ల కమ్మ నది, చెరువులు, పుష్కలంగా నీటి వనరులతో నైజీరియా కొంగలు పెద్దసంఖ్యలో వస్తుంటాయి. అయితే ఈ ప్రాంతాల్లో ఆ పక్షులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాయి. ఆహారానికి కొదువ లేకపోయినా ఆశ్రయానికి సరైన వసతి లేదు. వందల సంఖ్యలో పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇక్కడకు వస్తున్నా.. వాటి ఆవాసానికి అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. గతంలో వెలమవారిపాలెంలో పెద్ద చింత తోపు ఉండటంతో వాటి ఆశ్రయానికి ఇబ్బంది ఉండేది కాదు. అక్కడ గూళ్లు పెట్టుకుని సమీపంలో వేటసాగిస్తూ జీవనం సాగించేవి. అయితే చింతచెట్లు క్రమేపి కనుమరుగు కావడంతో సరిపడా చెట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాయి. ప్రస్తుతం అరకొరగా ఉన్న ముళ్ల చెట్లు, తుమ్మ చెట్లపైనే గూళ్ల పెట్టుకుని ఉంటున్నాయి. ప్రభుత్వం స్పందించి వెలమవారిపాలెం, మైలవరం గ్రామాల వద్ద చెట్ల పెంపకం చేపడితే విదేశీ పక్షులు రాక మరింత పెరిగే అవకాశం ఉందని పక్షి ప్రేమికులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మైలవరం చెరువుకు పూర్తిస్థాయిలో నీరు నింపాలని కోరుతున్నారు. అదే సమయంలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మోదీ నిర్ణయం చారిత్రాత్మకం

ఉగ్రవాదులకు బుద్ధి చెప్పేలా సిందూర్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

కారంచేడు(పర్చూరు), మే 8 (ఆంధ్రజ్యోతి): పాక్ ఉగ్రవాదుల దుశ్చర్యలకు బుద్ధి చెప్పేలా ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. గురువారం స్వగ్రామం కారంచేడులో జరిగిన శ్రీకోదండరామస్వామి దేవాలయ శంకుస్థాపన కార్యక్రమంలో దగ్గుబాటి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ రక్షణ కోసం మోదీ ప్రభుత్వం ఎంత దూరమైన వెళ్తుందన్నారు. ఉగ్రవాదులపై దాడి విషయంలో ప్రపంచ దేశాలన్నీ భారత్‌కు మద్దతుగా నిలిచాయన్నారు. ఉగ్ర దాడిలో సిందూరాన్ని పోగొట్టుకున్న 26 మంది మహిళల ఆకాంక్షలకు అనుగుణంగా ఆపరేషన్ సిందూర్ అని తెలిపారు. హఫీజ్ సయ్యద్ సంస్థలో ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తారని ముంబై తాజ్ హోటల్ దాడిలో పట్టుబడిన కసబ్ చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.



గుంటూరు మీదగా చర్లపల్లి, శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, శ్రీకాకుళం రోడ్డుకు ప్రత్యేక రైళ్లను నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ నెల 13 నుంచి జూన్ 24వ తేదీ వరకు(ప్రతీ మంగళవారం) (07421) చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక రైలు ఉదయం 6.55కి బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదగా 11.55కి గుంటూరు, రాత్రి 10.45కి శ్రీకాకుళం రోడ్డు చేరుకుటుంది. (07422) శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 14 నుంచి జూన్ 25వ తేదీ వరకు ప్రతీ బుధవారం బయలుదేరి గుంటూరు మీదగా చర్లపల్లి చేరుతుంది.

సైనిక్ స్కూల్‌కు అనుమతులు మంజూరు

శ్రీరామా విద్యా సంస్థల చైర్మన్ తులసీ విష్ణుప్రసాద్



కొల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు శ్రీరామా విద్యా సంస్థల చైర్మన్ కొలసాని తులసీ విష్ణుప్రసాద్ గురువారం తెలిపారు. చిలుమూరు విద్యా సంస్థలో విలేకర్ల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. 1949లో కొలసాని వెంకటసుబ్బయ్య శ్రీరామా గురుకుల పాఠశాలను స్థాపించారని తెలిపారు. 2021లో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 100 ప్రైవేట్ సైనిక్ స్కూళ్లను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయాలని భావించిందన్నారు. దానిలో భాగంగా సైనిక్ స్కూల్ ఏర్పాటుకు దరఖాస్తు చేయగా.. వారం క్రితం కేంద్ర ప్రభుత్వం, డిఫెన్స్ శాఖల నుంచి అనుమతులు మంజూరు కావడంతో.. మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్ పూర్తి చేయడం జరిగిందన్నాని వివరించారు. దేశ వ్యాప్తంగా కేవలం 33 సైనిక్ పాఠశాలలు ఉండగా.. నూతనంగా ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు మాత్రమే ఎంపికయ్యాయని చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో సైనిక్ స్కూల్ అడ్మిషన్స్‌కు అనుమతులు పొందినట్లు చెప్పారు. ఇక నుంచి శ్రీరామా సైనిక్ స్కూల్‌గా నామకరణం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొలసాని శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమాలను అరికట్టారా?

మిర్చియార్డు అధికారులను ప్రశ్నించిన మంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడలోని తన కార్యాలయానికి పిలిపించుకుని ప్రశ్నల వర్షం

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): యార్డులో అవినీతి, అక్రమాలను ఎంతవరకు అరికట్టారు.. లైసెన్సింగ్ సిస్టమ్‌లో ఎలాంటి మార్పులు చేశారు.. జీరోలు, కటింగ్, బిల్ టూ బిల్, లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేయడం వంటివి అరికట్టారా.. అని మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మిర్చియార్డు అధికారులకు పలు ప్రశ్నలను సంధించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయానికి మార్కెటింగ్, మిర్చియార్డు అధికారులను పిలిచి మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికతో పాటు ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, ఆంజనేయ సింగ్, ఇతర సెక్రెటరీలు హాజరయ్యారు కాగా ఆరు నెలల క్రితం తాను జారీ చేసిన ఆదేశాలు ఏమేరకు అమలు చేశారని ఆరా తీశారు. యార్డులో వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై అందిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ విభాగం గత ఏడాది దర్యాప్తు చేసి రూ. 436 కోట్ల మేరకు అవినీతి జరిగినట్లుగా పేర్కొంటూ అందుకు కొంతమంది అధికారులను బాధ్యులను చేసి రిపోర్టు ఇచ్చింది. దాంతో గత నవంబరులో మంత్రి అచ్చెన్నాయుడు గుంటూరు మార్కెటింగ్ కమిషనరేట్‌కు వచ్చి ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. జీరో బిజినెస్, కటింగ్ బిజినెస్ వల్ల యార్డు ఆదాయం పోతున్నదని ఈ సమావేశంలో కొంతమంది రైతులు, వ్యాపారులు మంత్రి సమక్షంలో చెప్పారు. బిల్ టూ బిల్‌తో వ్యాపారులు 2 శాతం కంటే అధికంగా కమీషన్‌ని వసూలు చేస్తున్నారని కొందరు రైతులు మంత్రికి ఫిర్యాదు చేశారు. యార్డులో లైసెన్సింగ్ వ్యవస్థ పకడ్బందీగా లేదని చెప్పారు. ఒక్కో కుటుంబంలో నాలుగైదు లైసెన్సులు పొంది ఉన్నారని, కొందరైతే లైసెన్సులు లీజుకు తీసుకొని అనధికారికంగా వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. వీటిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి లైసెన్సింగ్ వ్యవస్థ మొత్తాన్ని అధ్యయనం చేసి తనకు నివేదిక అందజేయాలని అప్పట్లో ఆదేశించారు. అది ఎంతమేరకు వచ్చిందని గురువారం జరిగిన సమావేశంలో అధికారులను ప్రశ్నించారు. ఒక కుటుంబానికి ఒక లైసెన్సుకు మించి ఉండరాదని, త్రీమెన్ కమిటీ రిపోర్టు లేకుండా లైసెన్సులు మంజూరు చేయడం, రెన్యువల్స్ వంటివి చేయరాదని స్పష్టం చేశారు. మిర్చి సీజన్ శుక్రవారంతో ముగియనున్నందున పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోల్డ్‌స్టోరేజ్‌లు, మిర్చి గోడౌన్లు వంటి ప్రదేశాల్లో క్రయవిక్రయాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిపై నిఘా పెట్టాలన్నారు. చెక్‌పోస్టులను పటిష్టం చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. కాగా మంత్రి అడిగిన ప్రశ్నలు అధికారులు స్పష్టంగా సమాధానాలు చెప్పలేకపోయారని తెలిసింది.

ముస్లింల అభ్యున్నతికి సహకారం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఆ తరువాత రాజకీయాలకు అతీతంగా ముస్లిం సోదరుల అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం దాచేపల్లిలోని విజయ భాస్కర కల్యాణ మండపంలో హజ్ యాత్రకు వెళ్తున్న ముగ్గురు ముస్లిం సోదరులకు లక్ష రూపాయల చొప్పున ఆయన ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గురజాల నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరులతో కలసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేనితో పాటు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జానబ్ షేక్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జానబ్ షేక్ హుస్సేన్ బాషా తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ సూపర్ - 6లో భాగంగా హజ్ యాత్రికులకు లక్ష రూపాయల చొప్పున అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 48 మందిని హజ్ యాత్రకు పంపించామని, రూ.50 లక్షలకు పైగా అందజేశామని వివరించారు. ముస్లిం సోదరుడి ఇల్లు తాకట్టులో ఉంటే తాను రూ.3 లక్షలు చెల్లించి విడిపించానని గుర్తుచేశారు. అల్లా దయ వల్ల అందరూ బాగుండాలని ఆయన వేడుకొన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ హజ్ యాత్రకు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

వెళ్లడం పవిత్ర కార్యక్రమం అన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జనాబ్ షేక్ మౌలానా ముస్తక్ అహమ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ముస్లిం సోదరుల హజ్ యాత్రకు సహకరించడం అనేది ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గొప్పతనమన్నారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ షేక్ హుస్సేన్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లింల పక్షపాతి కలిగిన ఎమ్మెల్యే అంటే మొట్టమొదట గుర్తు వచ్చేది ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేరేనని తెలిపారు. పిడుగురాళ్ల మునిసిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మీర్జా హఫీజ్ హుస్సేన్, సయ్యద్ అమీర్ ఆలీ, షేక్ బాబావలి పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం



విద్యార్థికి ఫీజు రాయితీ ధ్రువీకరణ పత్రం అందజేత

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 8, (ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం ఉదయం ఎస్సీ, ఎస్టీ ఓబీసీ కోటా కింద విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి ఓపెన్ కేటగిరి మెరిట్ విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకున్నారు. అడ్మిషన్స్ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 11న ఆదివారం వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. కేఎల్‌ఈ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన వారితో పాటు.. ఓపెన్ కేటగిరి కింద మెరిట్ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని పేర్కొన్నారు. జేఈఈలో అత్యుత్తమ పర్సంటైల్ పొందిన విద్యార్థులకు కూడా మెరిట్ స్కాలర్‌షిప్స్ ద్వారా అడ్మిషన్స్ పొందవచ్చన్నారు. కేఎల్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలో 3వ ర్యాంకు పొందిన ఆళ్ల వెంకట సాయి, అఖిల్‌కు, క్రీడల విభాగంలో జీగ్నాష్‌కు సీఎస్‌ఈ కోర్సులో 50 శాతం ఫీజు రాయితీతో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, కౌన్సిలింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ జగదీష్, కన్వీనర్ డాక్టర్ సుమన్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు అధికారికంగా ప్రవేశాలను అందజేశారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

పొన్నెకల్లు(తాడికొండ)మే 8(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి పొన్నెకల్లు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నెకల్లు గ్రామానికి చెందిన పేర్ల అన్నపూర్ణ(70) కొంతకాలంగా వెన్ను ముక నొప్పి కారణంతో.. పూర్తిగా మంచానికే పరి మితమైంది. బుధవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయి, తిరిగి వచ్చిన క్రమంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ అయింది. మంటలు వ్యాపించి అన్నపూర్ణ పూర్తిగా కాలిపోయింది. పై అంతస్తులో ఉన్న కూమార్తె, అమె భర్త గమని ంచి కిందకు వచ్చే సరికి మరణించింది. గురువారం మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆయుష్ వైద్యశాల స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం



స్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ప్రత్తిపాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నడింపాలెం ఆయుష్ వైద్యశాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుండి వచ్చిన బృందం గురువారం పరిశీలించింది. గుంటూరు - చిలకలూరిపేట జాతీయ రహదారిలో సర్వే నెంబరు 149/4ఏ లో 14.96 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ వైద్యశాలకు కేటాయించింది. డిల్లీ నుండి వచ్చిన సీసీఆర్ వైఎన్ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట్రావు, అసిస్టెంట్ డైరెక్టర్ కన్సల్టెంట్ ఎ.మోహన్‌రావు, భారత్ భూషన్, మినిస్ట్రి ఆఫ్ ఆయుష్ కన్సల్టెంట్ ఎంఏ ఖాన్ బృందం ఈ భూమిని పరిశీలించింది. ప్రత్తిపాడు తహసీల్దార్ కరుణ కుమార్ పూర్తి వివరాలు బృందానికి అందించారు. వీరి వెంట రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆయుష్ డైరెక్టర్ దినేష్ కుమార్, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సిన్హా పాల్గొన్నారు.

భూమి ఇవ్వలేదని.. తల్లిదండ్రులపై హత్యాయత్నం

అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల పేరుమీద ఉన్న 2.75 ఎకరాల భూమిని తమకు ఇవ్వడం లేదని వారిని పెట్రోల్ పోసి చంపు తామని బెదిరిం చిన కుమారుడు, కుమార్తె బెదిరించారు. ఈ ఘటన ఎండ్రాయి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రాజధాని అమరావతి ప్రభావంతో ఎండ్రాయి గ్రామంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రభుత్వం పూలింగ్‌కు తీసుకుంటామనడంతో గ్రామానికి చెందిన షేక్ సైదులు కుమారుడు నాగుల్ మీరా, కుమార్తె జాన్‌బీ, అల్లుడు అల్లాభక్షు నాలుగు రోజుల నుండి వృద్ధులపై ఒత్తిడి చేయడం ప్రారంభించారు. భూమి మీకు ఇస్తే..తామెలా బతకాలని సైదులు, అతని భార్య ఇందుకు నిరాకరించారు. ఉదయం తల్లిదండ్రులపై బిడ్డలిద్దరూ పెట్రోల్ పోశారు. భూమి తమకు పేరున రాసివ్వకపోతే.. చంపుతామని బెదిరించారు. చుట్టుపక్కల వారు అడ్డుపడి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. పోలీసులు వృద్ధులిద్దరినీ స్టేషన్‌కు తీసుకువచ్చి సమాచారం సేకరించారు. వారి కొడుకు, కూతరు, అల్లుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కోడలిపై మామ అత్యాచారయత్నం

మాచవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): కోడలిపై మామ అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. మాచవరం ఏఎస్ఐ పుల్లారావు వివరాల మేరకు.. కొత్తపాలెం గ్రామానికి చెందిన మురికిపూడి సౌభాగ్యరాజుకు.. బెల్లంకొండ మండలం పాపాయపాలెం గ్రామానికి చెందిన మరియ కుమారితో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 2న పొలానికి వెళ్లి వచ్చిన మరియకుమారి ఇంట్లో ఉండగా.. మామ నరసయ్య అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని పాపాయపాలెంలోని తల్లిదండ్రులకు మరియకుమారి తెలియజేసింది. బుధవారం రాత్రి మాచవరం పోలీసు స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

సత్తెనపల్లి రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందింది. అయితే శవ పంచనామాలో మృత దేహం వద్ద లభించిన లేఖలో..తన చావుకు ముగ్గురు కారణమని మృతురాలు పేర్కొంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అబ్బూరు గ్రామానికి చెందిన ఒంటిపులి వాణి(28) పది రోజుల క్రితం గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ వాణి గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతురాలికి ఐదేళ్ల క్రితం వివాహం అయ్యింది.. భర్త వెంకటేశ్వర్లు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి గుంటూరు జీజీహెచ్‌కి వెళ్లి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి వద్ద ఒక లేఖను గుర్తించారు. గ్రామానికి చెందిన ఇద్దరు తనను లైంగికంగా వేధిస్తున్నారని, వారి వేదింపులు తాళలేక గడ్డి మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు ఉంది. ఓ మహిళ కూడా ఇద్ద రితో చనువుగా ఉంటున్నావని, తన భర్తకు చెప్తానని బెదిరించేదని లేఖలో రాసుంది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	142, 151, 162
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

96,256 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు గురువారం 91,812 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 96,256 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 28,364 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	14000
334	9500	13400	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	----	----	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13300	దేవనూరుడీలక్స్	10000	12500
4884	10000	11200	ఆర్మూరు	9800	11200
సూపర్10	10000	12600	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					

హత్య కేసులో జీవిత ఖైదు, జరిమానా

అధునాతన టెక్నాలజీతో కేసును ఛేదించిన పోలీసులు

నరసరావుపేట లీగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇటుకరాయితో తలపై మోదీ ఓ వ్యక్తిని హతమార్చినట్లు నేరం రుజువడంతో నిందితుడు పట్టణంలోని శివసంజీవ కాలనీకి చెందిన తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్ల పందికి జీవిత ఖైదు, రూ.15వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి నేతి సత్యశ్రీ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కరివేదుల సంపత్‌రెడ్డి(45) 2023 మే 9న నరసరావుపేటకు వచ్చి స్థానిక గాంధీపార్క్ సమీపంలో తీవ్రగాయాలతో మృతి చెందాడు. అతడి తండ్రి కరివేదుల నరసింహారెడ్డి ఫిర్యాదు మేకరకు మొదటి పట్టణ పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు పాత నేరస్తుడు తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్లపందిగా గుర్తించారు. నిద్రలో ఉన్న సంపత్‌రెడ్డిను ఇటుకతో కొట్టి అతడి వద్ద ఉన్న నగదును అంకమ్మరావు తీసుకువెళ్లినట్లు సీసీ ఫుటేజి ఆధారంగా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ మేరకు అంకమ్మరావును అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించగా అప్పటి నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఆకుల అశోక్‌కుమార్ కేసును దర్యాప్తు చేశారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ

గుంటూరు(విద్య), మే 8 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు మెగా డీఎస్సీ క్రాష్ కోర్స్ శిక్షణను ఉచితంగా ఇస్తామని విభిన్న ప్రతిభావంతులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త ఒక ప్రకటనలో తెలిపారు. దృష్టి, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ తదితర విభిన్న ప్రతిభావంతులైన, అభ్యర్థులు విజయవాడలో నిర్వహించే ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం 40% శాతం వికలత్వం ఉన్నవారు మాత్రమే అర్హులని, టెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ నెల 11 వరకు ఎంపీఎఫ్‌సి.ఏపీసిఎఫ్ఎస్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పిడుగుపాటుకు 23 మూగజీవాలు మృతి



చెట్టుకింద మృతి చెందిన మేకలు

కొల్లూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు 23 మూగజీవాలు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అనంతవరంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈదురు గాలులు, ఉరు ములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. కార్మూరి వెంకటరామయ్యకు చెందిన మూగజీవాలు చింత చెట్టు కిందకు చేరాయి. అదే సమయంలో చింత చెట్టుపై పిడుగు పడటంతో 23 మేకలు మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు వరకు ఉంటుందని యజమాని తెలిపాడు. విషయాన్ని పశు వైద్యుడు రాజేంద్రప్రసాద్‌కు తెలియజేయడంతో.. వైద్యులు మృతి చెందిన మూగజీవాలను పరిశీలించారు. మేకల మృతిపై పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

ఘర్షణ కేసులో మూడు నెలల జైలు శిక్ష

నాదెండ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రు గ్రామంలో జరిగిన ఘర్షణ కేసులో చెవుల నరేంద్ర అనే వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ గురువారం కోర్టు తీర్పునిచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. 2018లో కన పర్రు గ్రామానికి చెందిన చీరాల అరవింద సాయి, అదే గ్రామానికి చెందిన చెవుల నరేంద్ర ఘర్షణ పడ్డారు. అరవింద సా యి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కొమ్మా లపాటి చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. వాదన లు విన్న ఏజేసీజే కోర్టు న్యాయమూర్తి స్వాతి నరేంద్రకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

వ్యవసాయ కళాశాలకు అంతర్జాతీయ ఖ్యాతి

●ఎన్జీ రంగా అగ్రి వర్సిటీ వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి



సభలో మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ కళాశాల అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించిందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి తెలిపారు. కళాశాల 80వ వార్షికోత్సవం గురువారం కళాశాలలోని డాక్టర్ బి వి.నాథ్ ఆడిటోరియంలో జరిగింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ డైరెక్టర్ డాక్టర్ తార సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలను పెంపొందించుకోవాలని చెప్పారు. నూతన అవకాశాలు గురించి విద్యార్థులకు డీన్ డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు వివరించారు. వ్యవసాయ విద్య ప్రాముఖ్యత గురించి డీన్ డాక్టర్ ఏవీ రమణ తెలిపారు. సాహిత్య, క్రీడ, సాంస్కృతిక పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరింపచేశాయి. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.ప్రసూనారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాలు

అమృతలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు గురువారం అందజేశారు. మండల పరిధిలోని తురుమెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు గ్రామానికి చెందిన కొసరాజు మురళీకృష్ణ జ్ఞాపకార్థం బ్యాగ్‌లు, ఆంగ్ల డిక్షనరీ అందించారు. అనంతరం మెమెంటో, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో 1 ఆర్ శోభాచంద్, హెచ్‌ఎం సత్యనారాయణ, బేతాళ కిరణ్, రవికబాబు, కొసరాజు రాంబాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ : ఎంపీడీవో

కర్లపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కర్లపాలెం మండల స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలకు వార్షిక జీవనోపాధుల రుణ ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి కుటుంబములో ఒక మహిళా వ్యాపారవేత్త లేదా పారిశ్రామికవేత్తను చేయటమే లక్ష్యముగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎమ్ శ్రీనివాసరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలుధనలక్ష్మీ, ఆకౌంటెంట్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణపత్రాలు వెంట ఉంచుకోవాలి

బాపట్లరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు వాహన ధ్రువీకరణపత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్ అన్నారు. గురువారం వెదుళ్ళపల్లి, స్టూవర్టుపురం రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా ఎస్సై భాగ్యరాజ్ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కారు నడిపేవారు తప్పనిసరిగా సీటుబెల్ట్‌ను ధరించాలని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై తెలిపారు.

ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉండాలి

కర్లపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా కూడా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం చేసే ప్రతి ప్రక్రియకు ఎల్లప్పుడు తోడుండాలని బీజేపీనాయకులు పేర్కొన్నారు. గురువారం కర్లపాలంలో వారు మాట్లాడుతూ, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవటానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు ప్రపంచ దేశాలు స్వాగతిస్తున్నాయన్నారు. . ఈ కార్యక్రమంలో బీజేపీనాయకుడు షేక్ కరీముల్లా, టీడీపీ నాయకుడు సమ్మెట నాగేంద్రరెడ్డి, ఇండియన్ పీపుల్ ఆర్గనైజేషన్ బార్గవ్‌రామ్ పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ ఇద్దరికి గాయాలు

బాపట్లరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి) : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన బాపట్ల మండలం హైదర్‌పేట వద్ద గురువారం చోటు చేసుకుంది. వెంటనే స్థానికులు 108కి సమాచారం అందించటంతో క్షతగాత్రులను బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు.

ధర్నా జయప్రదం చేయండి : ఏపీటీఎఫ్

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను అస్థవ్యస్థం చేసే విధానాలకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు దశలవారి పోరాటంలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉదయం 10గంటలకు ధర్నా జరుగుతుందని జిల్లా అధ్యక్షకార్యదర్శులు శేఖర్‌బాబు, పీడీ సోషలిజంలు తెలిపారు. ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలి వచ్చి ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జగన్‌ను జైలుకు పంపడం ఖాయం : కొల్లా

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): రెడ్‌బుక్ కాదు రాజ్యాంగమే జగన్‌ను జైలుకు పంపుతుందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12నెలలుగా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతూ వైసీపీ అభిమానులని కొడుతున్నారని, ప్రజలు భయాందోళనలలో బతుకుతున్నారని కాని అధికారంలోకి వచ్చేది ఖచ్చితంగా మనమేనని జగన్ మాట్లాడటం ఆత్మవంచనకు, పరనిందకు పరాకాష్టగా నిలుస్తుందన్నారు. జగన్ నేరాలు, ఘోరాలకు శిక్ష తప్పదన్నారు.



కౌలు రైతులకు సాగుదారుల హక్కుపత్రం అందజేస్తున్న మండల వ్యవసాయాధికారి సత్యానంద్, రెవెన్యూ అధికారులు

సాగుదారుల పత్రాలపై అవగాహన

పిట్టలవానిపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమలి, సంగుపాలెం కోడూరు రైతు సేవాకేంద్రాల పరిధిలోని గురువారం సాగుదారుల హక్కుపత్రాలపై రైతులకు మండల వ్యవసాయ, రెవెన్యూశాఖాధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పిట్టలవానిపాలెం మండల తహసీల్దార్ వెంకటేశ్వరరావుపాల్గొని మాట్లాడుతూ రైతులకు కలిగే లాభాలైన పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంటనష్టం, వ్యవసాయ రుణాలు తదితర ఉపయోగాలు గురించి రైతులకు తెలిపారు. మండల వ్యవసాయశాఖాధికారి సత్యానంద్ మాట్లాడుతూ ప్రతిఒక్క కౌలురైతు పంటసాగు హక్కు పత్రాల వల్లకలిగే వ్యవసాయ లాభాలు గురించి స్థానిక,మండల వ్యవసాయశాఖాధికారులు సూచించే సలహాలు గురించి రైతులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కె.శ్రీనివాసరావు, కోమలి, సంగుపాలెం, కోడూరు గ్రామపంచాయతీల సర్పంచ్‌లు నాగిరెడ్డి, ఐనంపూడి శ్రీనివాసరావు, ఎనికేపల్లి శివకుమారి, ఎంపీటీసీ చెన్నుబోయన గంగయ్య, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపాలెంలో వాహనాల తనిఖీ



వాహనదారులకు సూచనలు చేస్తున్న చందోలు ఎస్ఐ వెంకట శివకుమార్

పిట్టలవానిపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు పోలీసుస్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం టోల్‌ప్లాజా సమీపంలో గురువారం సాయంత్రం చందోలు ఎస్సై ఎం.వెంకటశివకుమార్ వివిధ వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు ఆటోడ్రైవర్‌లు సరైన ధ్రువీకరణపత్రాలు తమ వెంట ఉండేలా చూచుకోవాలన్నారు. మైనర్లకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ధ్రువపత్రాలు లేని ద్విచక్రవాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంట పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

భట్టిప్రోలు (కొల్లూరు), మే 8 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. భట్టిప్రోలులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొంటారని, మండలంలోని నాయకులు, కార్యకర్తలు అదిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. గ్రామ కమిటీలు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జీల సమావేశం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



భావన్నారాయణస్వామి దేవాలయ పాతరథం

వాడకుండానే..

ఊడదీశారు

భావదేవుని రథనిర్మాణంలో అపశృతులు

రథోత్సవం నాటికి పూర్తిఅయ్యేనా.....?

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): బాపట్లలో 1432 సంవత్సరాల క్రితం వెలసిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి వారి నూతన రథనిర్మాణంలో లోపాలు ఉన్నాయని వరమ్మతులు నిర్వహించడం భక్తులకు వేదనను మిగిల్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 1.50 కోట్ల రూపాయలు వెచ్చించి భావదేవుని నూతన రథం నిర్మాణం చేశారు. ఈ ఏడాది భావదేవుని బ్రహ్మోత్సవాలలో నూతన రథంపై స్వామివారిని ఊరేగించాలని నిర్ణయించారు. తూర్పుసత్రం దగ్గర నుంచి రథంబజారులో దేవాలయం ఎదురుగా నూతన రథాన్ని తీసుకొచ్చి పెట్టారు. దేవాదాయశాఖాధికారుల పర్యవేక్షణలో నిర్మించిన రథాన్ని పరిశీలించిన భక్తులు నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. దీనిపై అధికారులను ప్రశ్నించారు? పాత రథం ఒక విధంగా, కొత్తరథం మరోవిధంగా ఉందని పైగా రథశాలలో కొత్తరథం పట్టదని అనేక సందేహాలను భక్తులు చేపట్టటంతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. చరిత్ర కలిగిన భావదేవుని ఆలయానికి సంబంధించిన రథ నిర్మాణం సరిగ్గాలేదని చెప్పటంతో వెంటనే అధికారులు రథాన్ని ఊడతీసి గుట్టలుగా వేశారు. దీనిని చూచి భక్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కోటి50లక్షల రూపాయలతో నిర్లక్ష్యంగా రథాన్ని నిర్మిస్తారా అని ప్రతి ఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. రథశాల 35 అడుగుల ఎత్తు ఉంటే రథాన్ని 35అడుగుల ఎత్తులో ఎలా నిర్మించారని భక్తులు ప్రశ్నిస్తున్నారు? దానిపైన కలశాలను బిగిస్తారు కాబట్టి రథం మొత్తం ఎత్తు 42 అడుగులు వస్తుంది కాబట్టి దానిని రథశాలలో ఎలా పెట్టగలరు? ఆమాత్రం ఆలోచన కూడా చేయకుండా అటు అధికారులు, ఇటు నిర్మాణదారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారనేది భక్తుల ఆరోపణ. గతంలో ఉన్న రథం వెడల్పు, అందం ఈ రథానికి రాలేదని విమర్శిస్తున్నారు.



నిర్మాణం సరిగ్గాలేదని మరమ్మతులు చేస్తున్న నూతన రథం

12న రథోత్సవం

చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు ఆర్భాటంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 12వ తేదిన బావయ్య పౌర్ణమి రోజు శ్రీవారి దివ్యరథోత్సవం జరుగుతుంది. ఈ ఏడాది రథోత్సవం కొత్తరథంపై జరుగుతుందని భక్తులు ఆశించారు. కొత్తరథంపై భావదేవుడు కొలువు తీరి భక్తులకు దర్శనమిస్తారని ఆకాంక్షించారు. అయితే కొత్తరథం ఊడతీసి గుట్టలుగా వేసి మార్పులు, చేర్పులు చేస్తున్నారు. ఈ పనిఅంతా సకాలంలో పూర్తిఅయితేనే కొత్తరథంపై ఉత్సవం జరుగుతుంది. లేకుంటే పూర్వం నుండి ఉన్న పాత రథంపైనే భావదేవుని రథోత్సవం జరగనుంది. కాగా ఈవిషయమై ఆలయ ఈవో వెంకటేశ్వర్లను వివరణ కోరగా రథం ఎత్తు తగ్గించి మోడల్‌గా నిర్మిస్తున్నామని 10వ తేది నాటికి పూర్తి చేసి రథోత్సవం కొత్తరథంలోనే జరుపుతామని చెప్పారు.





నల్లమోతువారిపాలెం గ్రామంలో పచ్చిమిర్చి తోటలో అంతర పంటగా పెంచుతున్న బీర, ఎంవీ రాజుపాలెంలో మిరపచెట్లపై విస్తారంగా అల్లుకున్న బీరతీగ

మిరపతోటలో అంతర పంటగా బీరసాగు

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): అంతర పంటల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి పొందుతున్నారు. పచ్చిమిర్చి తోటలలో అంతర్ పంటగా బీరసాగు చేస్తున్నారు. జిల్లాలోని బాపట్ల, రేపల్లె నియోజకవర్గాలలోని గరువుమెరకభూములలో రైతులు పెద్దఎత్తున పచ్చిమిర్చి సాగు చేస్తుంటారు. ఈఏడాది కూడా బాపట్లనియోజకవర్గంలోని పాతనందాయపాలెం, కొత్తనందాయపాలెం, ఎం.వి.రాజుపాలెం, ఏట్రవారిపాలెం, నల్లమోతువారిపాలెం, యాజలి,దుండివారిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, బాపట్ల మండలంలోని నందిరాజుతోట, కొండుభొట్లపాలెం, పిన్నిబోయనవారిపాలెం, వెదుళ్ళపల్లి, పడమరబాపట్ల,బేతపూడి, స్టూవర్టుపురం, హైదర్‌పేట, చీరాల మండలంలోని తోటవారిపాలెం, చెరుకుపల్లి మండలంలోని రాంభొట్లపాలెం గ్రామాలలో పచ్చిమిర్చిసాగు సుమారు 1500 ఎకరాలలో చేశారు. ఒక్కొక్కరైతు 20సెంట్లు నుంచి ఎకరం పొలంలో ఈసాగు చేశారు. కిలోమిరప కాయల ధర 8రూపాయలు నుంచి ఇప్పటికి 30 రూపాయలకు చేరుకుంది. ధర లేని సమయాలలో రైతులు చేసేదిలేక పచ్చిమిర్చిని పండబెట్టి ఎండబెట్టారు. ఎండిన మిరపకాయలను కేవలం క్వింటా 5వేల రూపాయలకే విక్రయించారు. గత ఏడాది క్వింటా 10వేల రూపాయల వరకు పలికింది. అటు పచ్చిమిర్చికి ధరలేక, ఇటు ఎండబెట్టిన మిర్చికి ధరలేక సన్న,చిన్నకారు రైతులు, కౌలు రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దీంతో రైతులు మిరపతోటలలో అంతరపంటగా బీరసాగు చేపట్టారు. ప్రస్తుతం బీర సాగు కూడా ఆశాజనకంగా ఉంది.

కార్మికులను బానిసలుగా మార్చే లేబర్‌కోడ్‌ను రద్దు చెయ్యాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటియూసీ రాష్ట్రసమితి సభ్యుడు నాగాంజనేయులు

రేపల్లె, మే 8(ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచెయ్యాలని ఏఐటియూసీ రాష్ట్రసమితి సభ్యుడు పీ నాగాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం రేపల్లె ఏఐటియూసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 20వతేదిన కార్మికసంఘాలు నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమావేశం విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలోని మోడీ నాయకత్వంలో కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 44చట్టాల్లో 29చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చిందని ఈకోడ్ అమలయితే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోవటంతో పాటు సమ్మెచేసే హక్కును కోల్పోతారన్నారు. యాజమాన్యంతో జీతభత్యాలు మాట్లాడుకునే హక్కులను కోల్పోతామని యాజమాన్యానికి నచ్చకపోతే ఉద్యోగం తొలగించే విధంగా చట్టాలు మార్పులు చెయ్యటం హేయమైన చర్య అన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, నాయకులు గుమ్మడి నాగమల్లేశ్వరి, కుసుమకుమారి, శ్రీమన్నారాయణ, వెంకటరమణ, జయమ్మ, చిప్పల వీరరాఘవయ్య, పరుచూరు పద్మావతి, తులసి పాల్గొన్నారు.

పంటల సాగు హక్కు పత్రంపై అవగాహన

రేపల్లె, మే 8(ఆంధ్రజ్యోతి) : కౌలురైతుకార్డుల వలన పంట బీమా దక్కుతుందని వ్యవసాయశాఖ ఏడిఏ ఆర్.విజయబాబు తెలిపారు. గురువారం మండలంలోని బేతపూడి రైతుసేవా కేంద్రంలో పంటసాగు హక్కుపత్రంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతుల కార్డుల వలన ప్రకృతి వైపరీత్యాల వలన పంటనష్టం వ్యవసాయరుణాలు మరియు ధాన్యం అమ్ముకోవటానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ కౌలురైతుకార్డులు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామరెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు పంటసాగుపత్రాన్ని అందిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ విజయబాబు

మహిళల ప్రాణాలు కాపాడిన గజ ఈతగాళ్లు



సూర్యలంక సముద్రంలో గల్లంతైన ఉత్తరప్రదేశ్ మహిళలను రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చిన గజఈతగాళ్ళు, పోలీసులు

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరంలో గురువారం గజ ఈతగాళ్ళు ఇద్దరు మహిళలను ప్రమాదం నుంచి కాపాడారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దుర్గేష్‌దేవి, నీషాలు గుంటూరులోని ఏటుకూరు బైపాస్‌రోడ్డులో హనుమాన్ టెంపల్ సమీపంలోని బుల్లెట్ స్పిన్నింగ్‌మిల్లులో నివాసం ఉంటున్నారు. వీరు కుటుంబ సభ్యులతో కలిసి సూర్యలంక సముద్రతీరానికి వచ్చారు. సముద్రంలో స్నానం చేస్తుండగా పెద్దఎత్తున అలలు ఎగసిపడ్డాయి. దీంతో వీరు అలల తాకిడికి కొట్టుకుపోతూ.. మునిగిపోతూ కేకలు పెట్టారు. దీంతో వెంటనే స్పందించిన గజ ఈతగాళ్ళు, మెరైన్ సిబ్బంది, హోంగార్డులు పరుగున వెళ్ళి వారి ప్రాణాలు కాపాడి ఒడ్డుకు తీసుకొచ్చారు. మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి,ఎస్సై నాగశివారెడ్డి, ఏఎస్సై అమరేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ గంగాధరరావు, హోంగార్డు నారాయణ తదితరులు వారిని ఒడ్డుకు తీసుకొచ్చిన తర్వాత ప్రాథమిక చికిత్స చేసి సురక్షితంగా ఉన్నారని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వీరిని పలువురు అభినందించారు.

కౌలురైతు కార్డులపై గ్రామసభలు

చెరుకుపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి) : గురువారం చెరుకుపల్లి మండలంలోని రాంభొట్లపాలెం, కుంచాలవారిపాలెం గ్రామాలలో కౌలురైతుకార్డులపై గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అదికారి టి.బాలాజీగంగాధర్ మాట్లాడుతూ కౌలురైతులందరూ తప్పనిసరిగా కౌలు రైతు కార్డులను తీసుకోవాలని చెప్పారు. ఈకార్డు తీసుకోవడం వలన ప్రభుత్వం వారు ఇచ్చే పథకాలు అందుతాయని తెలియచేశారు. కౌలురైతులందరూ గ్రామరెవెన్యూ అధికారి మరియు గ్రామవ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు ఈకార్యక్రమంలో వీఆర్‌వోలు, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.



గజవాహనంపై భావదేవుడు

బాపట్ల,మే8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు గురువారం గజవాహనంపై కొలువుతీరారు. పండితులు శ్రీనివాసుల విఖనసమూర్తి, వినుకొండ శ్రీనివాసచార్యులు, సత్యంబాబు, బృందావనం గోపిచంద్, ధర్మకర్త దేశిరాజు రమణబాబు, ఉత్సవకమిటీ సభ్యులు పూజలు నిర్వహించి స్వామివారిని పురవీధులలో ఊరేగింపు చేశారు. భక్తులు స్వామివారికి హారతులిచ్చి ఆశీర్వచనాలు అందుకున్నారు.

రిజర్వు ఇన్‌స్పెక్టర్ స్వర్ణలత అరెస్టు

సబ్ రిజిస్ట్రార్‌ను బెదిరించిన

నకిలీ ఏసీబీ సీఐకి సహకరించారని అభియోగం

22 వరకు రిమాండ్



విశాఖపట్నం, మే 8 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బీ స్వర్ణలతను పీఎం పాలెం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన బలగా సుధాకర్ మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి... ఏసీబీ సీఐనని చెప్పి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణిని డబ్బులు డిమాండ్ చేయడంతో పీఎంపాలెం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన సుధాకర్.. కార్యాలయంపై తమకు చాలా ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై కేసు కట్టకుండా ఉండాలంటే రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో తమ ఉన్నతాధికారి మాట్లాడతారంటూ ఒక ఫోన్ నంబర్‌కు కాల్ చేసి చక్రపాణితో మాట్లాడించారు. 'సీఐ గారు చెప్పినట్టు చేయండి. అంతా ఆయన చూసుకుంటారని' ఆ మహిళా అధికారి చెప్పారని పీఎం పాలెం పోలీసులకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. దీంతో నకిలీ ఏసీబీ సీఐ సుధాకర్ ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఏసీబీ ఉన్నతాధికారిగా పేర్కొంటూ ఎవరితో మాట్లాడించారనే దానిపై దర్యాప్తు చేపట్టారు. ఆ నంబర్ గతంలో విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్‌లో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం బాపట్లలో రిజర్వు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న స్వర్ణలతదిగా గుర్తించారు. దీంతో ఆమెను గురువారం అరెస్టు చేసి కోరులో హాజరుపరచగా 14 రోజులపాటు రిమాండ్ విధించింది. కాగా స్వర్ణలత గతంలో నగరంలో ఆర్ఐగా పనిచేసినప్పుడు నోట్ల మార్పిడి వ్యవహారంలో బెదిరించి డబ్బులు గుంజారనే ఫిర్యాదు రావడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఆ సమయంలో ప్రభుత్వం ఆమెను సస్పెండ్ చేసింది. తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయడంతో బాపట్లలో పోస్టింగ్ ఇచ్చారు.



కళాజాత బృందాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ విజయమ్మ

వీధినాటకాల ద్వారా హెచ్‌ఐవీపై అవగాహన

బాపట్ల, మే8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కళాజాతర బృందాల ద్వారా వీధి నాటకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మురికివాడలలో, బస్‌స్టేషన్‌లలో వీధి నాటకాలతో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా జీవించాలనే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. ఎయిడ్స్ ఉన్న వారు ఏఆర్‌టి కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడితే జీవితకాలాన్ని పెంచుకోవచ్చుఅని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషనాధికారి డాక్టర్ రత్నమన్మోహన్, జిల్లా లెప్రసి అధికారి డాక్టర్ షేక్.మహ్మద్ సాధిక్, జిల్లా దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవం

బాపట్ల, మే8 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు అవసరాలు తీరుస్తూ వారు ఉన్నతశిఖరాలకు చేరుకోవటానికి ఆహర్నిశలు శ్రమించే తల్లిదండ్రులే పిల్లలకు ప్రత్యక్ష దైవమని అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. బాపట్ల పురపాలక సంఘం సహకారంతో స్టూడెంట్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో 10రోజులపాటు మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లలకు ఆయన గురువారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

హెన్రీడునాట్‌కు నివాళులు

కర్లపాలెం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి రెడ్‌క్రాస్ సొసైటీ సహాయం చేస్తుందని కర్లపాలెం రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ ఇనకొల్లు పోలీసురావు అన్నారు. గురువారం కర్లపాలెంలో స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులు రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీడునాట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఎం.పరమానందకుమార్, సి.ధనుంజయ్‌రావు, బి.రాజేష్, జి.వెంకటరెడ్డి, వి.బాబు తదితరులు పాల్గొన్నారు.

భారత రెడ్‌క్రాస్ సమావేశానికి నారాయణభట్టు

బాపట్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): భారత రెడ్‌క్రాస్ సర్వసభ్య సమావేశానికి బాపట్ల జిల్లా ప్రతినిధిగా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బీఎస్ నారాయణభట్టుకు ఆహ్వానం లభించింది. ఈ నెల 13,14 తేదిలలో జాతీయ రెడ్‌క్రాస్ సమావేశాలు ఢిల్లీలో జరుగుతాయి. కేంద్ర మంత్రి, జాతీయరెడ్‌క్రాస్ ఛైర్మన్ నడ్డా ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలలో రాష్ట్రపతి, రెడ్‌క్రాస్ జాతీయ అధ్యక్షులు ద్రౌపదిముర్ము పాల్గొని దిశా నిర్దేశం చేస్తారని నారాయణభట్టు తెలిపారు.

అవీ..ఇవీ..

ఎస్సై ఖాదర్‌బాషాకు వీఆర్

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఖాదర్‌బాషాను గురువారం జిల్లా అధికారులు వీఆర్‌కు పిలిచినట్లు తెలుస్తుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌హెచ్‌వోగా ఉన్న అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న ఖాదర్‌బాషాపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వీఆర్ కు పిలిచినట్లు సమాచారం.

రాయితీపై పశువుల దాణా

అద్దంకిటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): పశుగ్రాస భద్రత విధానంలో భాగంగా దారిద్య రేఖకు దిగువన ఉన్న రైతులకు 20 శాతం క్రూడ్ ప్రోటీన్ కలిగిన పశుదాణాను రాయితీపై అందజేస్తున్నట్లు అద్దంకి పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.మోహనరావు గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 50 కిలోల దాణా సంచి పూర్తి ధర రూ.1110 కాగా ప్రభుత్వం రాయితీ కింద రూ.555లకు ఇస్తుందని అన్నారు. రైతు ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డుతో పాటు మీ గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పశువులకు చెవికి కమ్మ కచ్చింగా ఉండాలని, టీకాలు వేసి ఉండి రైతు పేరు భారత్ పశుధన్‌లో నమోదు చేయించుకుని దాణాని పొందాలన్నారు. ఒక్కో కుటుంబానికి 450 కిలోలు మాత్రమే వస్తుందన్నారు. 2 గేదెలు, 1 దూడకు వీటిని అందిస్తారన్నారు.పశువులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

● 50 వేల రూపాయల ఆస్థి నష్టం

సంతమాగులూరు(అద్దంకి), మే8(ఆంధ్రజ్యోతి): సంతమాగులూరు మండలం కుందుర్తిలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన మిరియాల కొండలుకు చెందిన ఏడెకరాల్లోని వరిగడ్డి వామి దగ్ధమైంది. వరిగడ్డి వామి దగ్ధం కావడంతో సుమారు రూ.50 వేల ఆస్థి నష్టం వాటిల్లినట్లు అద్దంకి అగ్నిమాపక కేంద్రం అధికారి వెంకట్రావు తెలిపారు. అద్దంకి అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు.

మహాకుంభాభిషేకానికి ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న ఈవో

అద్దంకి, మే8 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి రాతి మండపం నిర్మాణం పూర్తయి 19న మహాకుంభాభిషేకం జరగనున్న నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారథి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లను ఆహ్వానించారు. ఈఓ తిమ్మానాయుడు, వేదపండితులు హరిశంకరావధాని, పూజారులు కలిసి ఆహ్వానించారు.

రాతి మండపం నిర్మాణాకి విరాళం

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి రాతి మండపం నిర్మాణానికి అద్దంకి మండలం నాగులపాడుకు చెందిన జాగర్లమూడి వేణుబాబు, సౌజన్య దంపతులు గురువారం 1,00,116ను రూపాయలను ఈఓ తిమ్మానాయుడు కు అందజేశారు.

మండల సమాఖ్య కార్యాలయానికి పేరు మార్పు



బల్లికురవ మండల సమాఖ్య కార్యాలయానికి మార్చిన పేరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ. మే 8 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు బల్లికురవ మండల పొదుపు సంఘాల మహిళ సమాఖ్య కార్యాలయానికి వెలుగు కార్యాలయంగా పేరు ను అధికారులు మార్పించారు. మంగళవారం వైఎస్ఆర్ క్రాంతి పథం కార్యాలయంగానే కొనసాగుతున్న వెలుగు కార్యాలం అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితం అయిన వార్త కధనానికి జిల్లా అధికారులు స్పందించారు. వెంటనే బల్లికురవ వెలుగు కార్యాలయంపై ఉన్న వైఎస్ఆర్ క్రాంతి పథం అనే పేరును తొలగించాలని జిల్లా నుండి వచ్చిన ఆదేశాల మేరకు ఏపీఎం రాజారావు మహిళ సమాఖ్య కార్యాలయంపై వెలుగు కార్యాలయం అని పేరును ఏర్పాటు చేశారు. స్థానిక మండల అధికారులు జిల్లా అధికారులకు గతంలో ఉన్న పేరుపై వివరణ ఇచ్చారు.

ముదిరిన సొన పోరంబోకు స్థల వివాదం

పంచాయతీ కార్యదర్శిపై కేసు నమోదు


వివాదస్పద స్థలంలో కార్యదర్శి తోలిన రాళ్లు

రామన్నపేట(చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ కార్యదర్శి సురేంద్రపై వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పంచాయతీ పరిధిలోని బాపయ్యనగర్‌లో సొనపోరంబోకు స్థలం సుమారు 65 సెంట్లు ఉంది. ఇప్పటికే ఆ స్థలాన్ని స్థానికులు కొంత మంది అనుభవంలో ఉన్నారు. ఈక్రమంలోనే అదే ప్రాంతంలో నివాసముంటున్న చొప్పవరపు సంతోష్, ఆయన కుటుంబ సభ్యులు వారి పట్టా స్థలానికి ఆనుకుని ఉన్న కొంత సొన భూమిలో ఏళ్ల తరబడి పశువుల కొష్టం నిర్మించుకున్నాడు. అయితే దానిపై కన్నేసిన ఆ పంచాయతీ కార్యదర్శి సురేంద్ర అందులో తాను శాశ్వత నిర్మాణం చేసుకునేందుకు పూనుకున్నాడు. దీనికోసం ఏకంగా రాళ్లు కూడా తోలాడు. తనకు ఎలాంటి పట్టా లేకపోయినా, స్వయంగా తానే కార్యదర్శిగా ఉంటూ ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూడడం గమనార్హం. ఈక్రమంలోనే ఇప్పటికే అనుభవంలో సంతోష్‌కు, సురేంద్రకు మధ్య పలుమార్లు వాదనలు జరిగాయి. అయినప్ప టికీ, కార్యదర్శి సురేంద్ర ఆ స్థలంలో సిమెంట్ రాళ్లు తోలడంతో సంతోష్, కార్యదర్శిల మధ్య జరిగిన ఘర్షణ తారాస్థాయికి చేరింది. ఏకంగా సెంట్రింగ్ చెక్కతో సంతోష్ ముఖంపై కార్యదర్శి సురేంద్ర దాడి చేశాడు. దీంతో సంతోష్ తలకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందాడు. అలాగే పంచాయతీ కార్యదర్శి కూడా స్వల్పగాయాలతో వైద్యశాలలో చేరాడు. పరస్పర ఫిర్యాదుల మేరకు వేటపాలెం పోలీసులు కేసులు నమోదు చేశారు.

పంచాయతీ కార్యదర్శిపై విమర్శలు వెల్లువ

ప్రభుత్వ ఆస్తిని రక్షించాల్సిన కార్యదర్శి, స్థలాన్ని తాను ఆక్రమించాలని చూడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే తాను ఆక్రమించాలని చూడలేదని, ఉన్నతాధికారుల ఆదేశాలతోనే స్థలం వద్దకు వెళ్లగా సంతోష్ దాడిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒకవేళ సంతోష్‌దే తప్పిదమయితే విషయం అధికారుల దృష్టిలో ఉంచి చర్యలకు పూనుకోవాలే గానీ, విచక్షణ రహితంగా దాడి చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. మరోవైపు మండల స్థాయి అధికారులు విషయంపై పూర్తి స్థాయిలో నివేదికను సిద్ధం చేస్తున్నారు. శుక్ర, శనివారాల్లో జిల్లాస్థాయి అధికారులకు ఘటనపై పూర్తి వివరాలను అందజేయనున్నట్లు తెలుస్తోంది.

అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణ పనులు ప్రారంభం


ప్రారంభమైన భవన నిర్మాణ పనులు

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసిన పుష్కరకాలం తరువాత ఎట్టకేలకు సొంత గూడు ఏర్పడుతోంది. అద్దంకి పట్టణానికి 2013లో అగ్నిమాపక కేంద్రం మంజూరయ్యింది. అప్పట్లో తాత్కాలికంగా మార్కెట్ యార్డులో ఉంచారు. అయితే అగ్నిమాపక యంత్రం ఏర్పాటుకు కనీసం షెడ్డు కూడా లేకపోవడంతో గొట్టిపాటి రవికుమార్ లక్ష రూపాయలు సొంత నిధులు వెచ్చించి మార్కెట్ యార్డులోని గోడౌన్‌ల మధ్య ఖాళీలో రేకులషెడ్డు ఏర్పాటు చేయించారు. సిబ్బంది మార్కెట్‌యార్డు కార్యాలయంలో ఓ చిన్న గదిలో విధులు నిర్వహిస్తున్నారు. ఎట్టకేలకు గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం నిర్మాణానికి శింగరకొండ రోడ్డులో స్థలం కేటాయించారు. దీంతో సుమారు రూ.2.25 కోట్లతో అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణానికి ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. గురువారం నుండి అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై బీజేపీ హర్షం

బాణసంచా, స్వీట్లు పంపిణీతో కోలాహలం



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చీరాల, మే 8 (ఆంధ్రజ్యోతి) : పాక్ ఉగ్ర మూకలపై భారత సైనికులు చేసిన సిందూర్ ఆపరేషన్ విజయవంతంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో బిజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమాయక పర్యాటకులపై పాక్ చేసిన దాడులను యావత్‌ప్రపంచం ఖండించిందన్నారు. ఈనేపద్యంలోనే ప్రధానీ మోదీ సరైన సమయంలో పాక్ ఉగ్ర వాదులకు గుణపాఠం చెప్పారని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండారుపల్లి హేమంత్‌కుమార్, భవానీ, నాగేశ్వరరావు, వెంకటేష్, భరణి, సుజాత, కుమార్, చంద్ర, అశోక్ పాల్గొన్నారు.

వేగంగా వస్తున్న కారుకు టైర్ పంక్చర్

● ముందు వెళుతున్న బైకును ఢీకొట్టిన కారు ● ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంగయ్య

బల్లికురవ. మే 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు సమీపంలో వేగంగా వస్తున్న కారు టైర్ పంక్చర్ కావటంతో ముందు వెళుతున్న బైకును కారు ఢీకొట్టింది. ఈప్రమాదంలో బైకుపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. అందిన సమాచారం మేరకు అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన అయప్ప, గంగయ్య అను ఇద్దరు బల్లికురవ మండలం సూరేపల్లి వెళ్లి తిరిగి బుధవారం మధ్యాహ్నం స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా కొప్పెరపాడు గ్రామ సమీపంలో సంతమాగులూరు వైపు నుండి అద్దంకి వైపు వెళుతున్న కారు టైర్ పంక్చర్ కావటంతోకారు అదుపు తప్పి ముందు వెళుతున్న బైకును ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలు అయిన అయప్ప, గంగయ్యలను హైవే అంబులెన్స్ లోచికిత్స కొరకు నర్సారావుపేట వైద్య శాలకు తరలించారు.

నూతన భవనంలోకి వైదన సచివాలయం

బల్లికురవ, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి అయిన భవనంలోకి గ్రామ సచివాలయాన్ని గురువారం మార్పు చేశారు. గతంలో ఉన్న భవనం పురాతన కాలం నాటిది కావటంతో నూతనంగా ప్రభుత్వ నిధులతో అన్ని వసతులతో నూతన భవనాన్ని నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు, గ్రామ టీడీపీ నేతలు పోగుల శేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం సచివాలయ ఉద్యోగులు తమ సామాగ్రిని నూతన భవనంలోకి తరలించారు. ఇక నుండి నూనత భవనంలో ప్రజలకు సేవలు అందుతాయని అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీలపై యాప్ పని భారాన్ని తగ్గించాలి


వినతిపత్రం అందజేస్తున్న అనంతలక్ష్మి

అద్దంకిటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు తీసుకువచ్చిన యాప్‌లో పనిభారాన్ని తగ్గించాలని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనంతలక్ష్మి కోరారు. గురువారం సచివాలయంలో రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని యూనియన్ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలని, ఆయాలకు, టీచర్లకు కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అన్ని అమలయ్యేలా జీవో సవరణ చేయాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ సెలవులు, పెరిగిన ధరలకు అనుగుణంగా కూరగాయాలు, గ్యాస్ బిల్లులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. లక్ష్మి నరసమ్మ, సభ్యులు కల్యాణి వినిలా తదితరులు ఉన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

చీరాల ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు


రీసర్వేపై సమీక్ష చేస్తున్న చీరాల ఆర్‌డీవో

అద్దంకి, మే8 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే వేగవంతం చేయాలని చీరాల ఆర్‌డీవో చంద్రశేఖర నాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అద్దంకి, కొరిశపాడు మండలాల వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్లతో, ఆయన సమీక్ష నిర్వహించారు. వేసవి ఎండల దృష్ట్యా రీసర్వే ఉదయం, సాయంత్రం సమయాలలో పూర్తి చేయాలన్నారు. రైతులకు ముందస్తుగానే నోటీసులు ఇచ్చి రీసర్వే సమయంలో హజరయ్యే విధంగా చూడాలన్నారు. నీటి తీరువా బకాయిలు వసూలుపై దృష్టి సారించాలన్నారు. తహసీల్దార్లు శ్రీచరణ్, సుబ్బారెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత వ్యవధిలో రీసర్వే పూర్తిచేయాలి

పంగులూరు : రెవెన్యూ రికార్డుల పరిశీలన, రైతుల అనుభవం ప్రాతిపదికన నిర్ణీత వ్యవధిలో నిష్పక్షపాతంగా భూముల రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు ఆదేశించారు. పంగులూరు మండలంలోని బైట మంజులూరు, కొండమూరు గ్రామాలలో జరుగుతున్న భూముల రీసర్వేపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. రీసర్వే ప్రాధాన్యతను రైతాంగానికి వివరించాలన్నారు. కార్యక్రమం లో తహసీల్దార్ పీవీ.సింగారావు, రీసర్వే డీటీ అర్జున్, మండల సర్వేయర్ బి.సురేష్‌బాబు, వీఆర్‌వోలు గ్రామ సర్వేయర్లు, పాల్గొన్నారు.

'నమస్తే' కార్యక్రమంపై అవగాహన

● వ్యర్థాలు సేకరించేవారితో 14న ప్రత్యేక సమావేశం

అద్దంకి, మే8(ఆంధ్రజ్యోతి): చెత్తకాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే వారిని సామాజిక భద్రత పథకాలలో భాగస్వామ్యం చేసేందుకు ఈ నెల 14న అద్దంకిలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. నేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం(నమస్తే) ద్వారా పారిశుధ్య కార్మికులు, పొడి వ్యర్థాలను సేకరించే వారికి గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు, నైపుణ్యం మెరుగుదలకు తోడ్పాటు, శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. తద్వారా సాధికారిత కల్పించడమే 'నమస్తే' కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. నిర్వహణపై గురువారం బాపట్ల జిల్లా రిసోర్స్ ఆర్గనైజర్లు దార్ల కోటేశ్వరరావు, భగవాన్‌దాస్‌లు మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

అద్దంకి, మే8(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధింపులపై గురువారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కధనం మేరకు మండలంలోని ధేనువకొండకు చెందిన గుంజి సుశీలకు 15 సంవత్సరాల క్రితం మేనత్త కుమారుడు శ్రీనివాస్‌తో వివాహమైంది. వివాహం సమయంలో రూ.10 వేల రూపాయల నగదుతో పాటు 4 సవర్ల బంగారం ఇచ్చారు. ప్రస్తుతం వారు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ కొంతకాలంగా మద్యానికి బానిసై అదనపు కట్నం కోసం వేధించటం ప్రారంభించాడు. అత్త,మామలను కూడా ఇబ్బంది పెడుతూ రెండు నెలల క్రితం సుశీలను పుట్టింటికి పంపారు. సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

సారవంతమైన భూమితో సాగుకు మేలు

తోటవారిపాలెం(చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : భూమిలో ఉన్న సారాన్ని నిశితంగా అంచనా వేసి సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ డివిజన్ అధికారి భారతి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని తోటవారిపాలెం. గవినివారిపాలెంలలో ఏపీ సీఎన్ఎఫ్(ఏపి భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం), పీఎండీఎస్(ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళిక) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతి, టీడీపీ నాయకులు నాదెండ్ల కోటేశ్వరరావు, రైతుసంఘం నాయకులు కావూరి రమణారెడ్డి, కోటేశ్వరమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కవిత, స్వరూప నిర్మలరైతులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ విద్యార్థి మృతిపై కేసు నమోదు

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): నాగార్జున యూనివర్శిటీ లో బిపిఎడ్ చదువుతున్న తిప్పాబత్తిన గురు బ్రహ్మయ్య(27) గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పై గురువారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవితేజ తెలిపారు. పోలీసుల కధనం మేరకు మండలంలోని కొటికలపూడికి చెందిన గురుబ్రహ్మయ్య నాగార్జున యూనివర్శిటీ లో బీపీఎడ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఫిబ్రవరి 26న ఇంటికి వచ్చిన గురుబ్రహ్మయ్య బయటకు వెళ్లి మధ్యహ్నం 1 గంట సమయంలో ఇంటికి వచ్చి మౌనంగా ఉన్నాడు. కుటుంబసభ్యులు ఆరా తీయగా గడ్డి మందు తాగినట్లు చెప్పడంతో ఒంగోలులోని ప్రవేట్ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మార్చి 5న మృతి చెందాడు. అక్కడి నుండి వచ్చిన సమాచారం మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవితేజ తెలిపారు.

విద్యుత్‌శాఖ డీఈగా శ్రీనివాసరావు బాధ్యతలు

వేటపాలెం (చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం విద్యుత్ డీఈగా పెరుగు శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చెరుకుపల్లి ఏఈగా ఉన్న ఆయన ఉద్యోగోన్నతిపై వేటపాలెంకు విచ్చేశారు. అలాగే ఇప్పటి వరకు ఇక్కడ విధుల్లో ఉన్న శ్రీనివాసులు పర్చూరుకు బదిలీ అయ్యారు. ఈక్రమంలో కార్యాలయం సిబ్బంది డీఈకి స్వాగతం పలికారు.

ట్రాలీవాహనం ఢీకొని ఆటోడ్రైవర్‌కు గాయాలు

ఈపూరుపాలెం (చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : ఆటోను అతివేగంతో గుర్తుతెలియని ట్రాలీవాహనం ఢీ కొనడంతో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. అలాగే డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఉదయం ఈపూరుపాలెం చెక్‌పోస్టు సమీపంలో చోటుచేసుకుంది. దీంతో స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చీరాల వైపు నుండి వెదుళ్లపల్లి వైపు వెళుతున్న బొలేరో అదుపు తప్పి రాంగ్‌రూట్‌లో ఆటోను ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఈపూరుపాలెం(చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దీంతో ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నేడు మంత్రి పర్యటన

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఉదయం 10-30 గంటలకు పంగులూరు మండలం తూర్పుకొప్పెరపాడు, 11-30 గంటలకు అద్దంకి మండలం గోవాడ, మధ్యహ్నం 12 గంటలకు సంతమాగులూరు మండలం కామేపల్లిలలో పర్యటించనున్నారు.

కోదండరామ స్వామి ఆలయానికి శంకుస్థాపన


పూజాలు చేస్తున్న వెంకటేశ్వరరావు దంపతులు


కారంచేడు(పర్చూరు), మే 8 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలోని కోదండరామ స్వా మి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరావు దంపతులు పాల్గొని స్వామివారి భక్తిని చాటుకున్నారు. ఆలయ అర్చకుల సారధ్యంలో స్వామివార్ల ఆలయ శంకుస్థాపన నిర్వహించారు. ఆనంతరం గ్రామస్థులతో కొంతసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న అర్చకులు

పంగులూరు, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు కొండపై కొలువుదీరిన రామలింగేశ్వర స్వామి తృతీయ వార్షిక మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు ఆలయ గిరి ప్రదక్షణ, అనంతరం మహాగణపతి పూజ, మహన్యాసం, శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఏకాదశ రుద్రాభిషేకం, బాలాత్రిపురసుందరీదేవి కుంకుమార్చన, సుబ్రహ్మణ్య స్వామి పూజ, శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి కుంకుమార్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకునని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

13న అద్దంకిలో ధ్వజస్తంభం ఊరేగింపు


ఊరేగింపుకు సిద్ధంగా ఉన్న ధ్వజస్తంభం

అద్దంకి,మే8(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 19న మహాకుంభాభి షేకము తో పాటు జీవ ధ్వజస్థంభము పునః ప్రతిష్ట జరగనుంది. గతంలో ధ్వజస్తంభం ను సుమారు నాలుగు దశాబ్దాల క్రితం మేదరమెట్ల శంకరారెడ్డి సమకూర్చారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కూడా మేదరమెట్ల శంకరారెడ్డి కుమారులు రాజశేఖరరెడ్డి, చం ద్రశేఖరరెడ్డి లు సమకూర్చుతున్నారు. జీవధ్వజస్థంభం ను అద్దంకి లో సిద్దం చేస్తున్నారు. 14 వ తేది నుండి శింగరకొండ లో ప్రత్యేక పూజలు జరగనున్న నేపథ్యం లో 13 వ తేది జీవ ధ్వజస్థంభం ను అద్దంకి లో ఊరేగింపు నిర్వహించనున్నారు. సాయం త్రం 4 గంటలకు నంబూరివారిపాలెం వద్ద సొసైటీ కార్యాలయం నుండి ఊరేగింపు ప్రారంభమై రేణింగవరం రోడ్డు, కాకానిపాలెం మండపం, పోతురాజుగండి, ఆర్టీసీ బస్టాండ్, పాత బస్టాండ్ సెంటర్, గాంధీబొమ్మసెంటర్, భవానిసెంటర్ మీదుగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వరకు సాగుతుందని ఈఓ తిమ్మానాయుడు తెలిపారు.


పోలేరమ్మ దేవస్థానంలో ఎమ్మెల్యే పూజలు

పాతచీరాల(చీరాల), మే 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పాత చీరాల గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మేదరమెట్ల, మే 8(ఆంధ్రజ్యోతి): మహిళలకు జీవనోపాధిగా ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణను అందరు సద్వినియోగపర్చుకోవాలని బీసీ కార్పోరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మేదరమెట్లలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. శిక్షణ కేంద్రం నిర్వహణ, సౌకర్యాలను శిక్షణ పొందుతున్న మహిళలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ సద్వినియోగపర్చుకుని ఉపాధి మార్గాలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మికాంత్, శిక్షణ కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

ఈదురు గాలులతో చల్లబడిన వాతావరణం


బల్లికురవలో కురుస్తున్న వర్షం

బల్లికురవ, మే 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గురువారం ఈదురు గాలులు భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వేసవి ఎండలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరికి గురైన వారు ఇళ్ల నుండి బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సాయంత్రం వాతావరణంలో మార్పులు వచ్చి ఆకాశంలో ఉరుములు, మెరుపులు, గాలులతో భారీ వర్షం కురవటంతో రోడ్లు అన్ని జలమయం అయ్యాయి. వర్షాకాలంలో మాదిరి వర్షం పడిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.. ఈదురు గాలుల ప్రభావానికి పెద్ద పెద్ద చెట్లు కూడా నేల వాలేలా ఊగి పోయాయని ప్రజలు తెలిపారు. అన్ని గ్రామాలలో వర్షం పడిందని ప్రజలు అంటున్నారు. గాలుల ప్రభావంతో రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది.

అద్దంకి లో ఉరుములతో వర్షం

అద్దంకి : అద్దంకిలో గురువారం రా త్రి ఉరుములతో వర్షం కురిసింది. గాలులు ఎక్కువగా ఉండటంతో విద్యుత్ సరఫరాకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. సుమారు అరగంట పాటు వర్షం కురిసింది. మండలం పరిధిలోని చినకొత్తపల్లి, గోవాడ తదితర గ్రామాలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. మొక్కజొన్న పంట, మిర్చి కల్లాలలో ఉన్న రైతులు పంటను కాపాడుకొనేందుకు పరుగులు తీశారు.

పిడుగుపాటు బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

చీరాల, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అకాలంగా వర్షం కురిసిన సమయంలో పిడుగుపడి నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందించింది. చీరాల మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతు పిట్టు పోతురాజుకు చెందిన రెండు ఎడ్లు మృత్యువాత పడగా రూ.80 వేలు, అలాగే పాత చీరాలకు చెందిన నాయుడు మనోహర్‌రెడ్డి గేదె మృతి చెందగా రూ.50 వేలు, హరి ప్రసాద్‌నగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డికు చెందిన గేదెపై పిడుగు పడి మృతి చెందగా రూ.50 వేలు, కొత్తపేటకుచెందిన కటకం మహేశ్వరరావుకు చెందిన గేదె మృతి చెందగా రూ.50 వేలు పరిహారం చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయన వెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపిడివో శివసుబ్రహ్మణ్యం ఉన్నారు.